నమస్తే తెలంగాణ
సిద్దిపేట
11 | హైదరాబాద్, శనివారం 24 ఫిబ్రవరి 2024 | SIDDIPET

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్లకు ఉచిత అల్పాహారం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

దేశంలోనే ఆర్టీసీని నంబర్‌వన్ సంస్థగా రూపుదిద్దుతాం

మేడారం జాతరలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర కీలకం

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ఎంతో మేలు

మరిన్ని కొత్త బస్సులు తెప్పించేందుకు కృషి చేస్తున్నాం

రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన మంత్రి

హుస్నాబాద్, ఫిబ్రవరి 23: తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్‌వన్ సంస్థగా రూపుదిద్దుతామని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. మేడారం జాతరకు బస్సు సౌకర్యం, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు, మేడారం జాతర భక్తులతో మాట్లాడి ఆర్టీసీ బస్సుసౌకర్యంపై ఆరా తీశారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రైవర్లకు అల్పాహారం, నీళ్ల బాటిళ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను విజయవంతం చేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండటం వల్ల మహిళలు పెద్ద సంఖ్యలో మేడారం జాతరకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుంటున్నారన్నారు. హుస్నాబాద్ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు మేడారం వెళ్తుంటారని, ఇప్పటి వరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాతరకు వెళ్లివస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇప్పించడం, డీఏలను ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుందన్నారు. పీఆర్సీపై కూడా ప్రభుత్వం చర్చిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా ఆర్టీసీ సంస్థ పనిచేస్తోందని చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భవిష్యత్‌లో ఆర్టీసీకీ పూర్వ వైభవం తీసుకొచ్చి దేశంలో ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో ఆర్టీసీకి మరిన్ని బస్సులు తెప్పించేందుకు కూడా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ఉద్యోగులు, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

ఇటికేపల్లి నుంచి జహీరాబాద్‌కు నీటిని అందించాలి

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

మున్సిపాలిటీ ఆదాయం పెంచుకోవాలి

రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జహీరాబాద్, ఫిబ్రవరి 23: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, మంజీరా నీటిని జహీరాబాద్ పట్టణ ప్రజలకు అందించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. పట్టణానికి తాగునీరు ఎక్కడ నుంచి వస్తుందని ప్రశ్నించగా, సింగూరు ప్రాజెక్టు వద్ద ఉన్న మిషన్ భగీరథ సంపు నుంచి వస్తున్నాయని తెలిపారు. రాయికోడ్ మండలంలోని ఇటికేపల్లి మంజీరా బ్యాక్ వాటర్ వద్ద ఏర్పాటు చేసిన సంపు నుంచి కూడా నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఇటికేపల్లి నుంచి నీటిని తరలించే పైపులైన్ కోసం ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే కొత్త పైపులైన్ వేసి నీటిని అందిస్తామని అధికారులు మంత్రికి వివరించారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. మున్సిపల్ ఆదాయం పెంచేందుకు కృషి చేసి, పారిశుధ్య పనులు వేగవంతం చేయాలన్నారు. పట్టణంలోని రైల్వే గేట్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు వేగవంతంగా పూర్తి చేసి మే వరకు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలిన ఆర్అండ్‌బీ డీఈఈ నర్సిములును ఆదేశించారు. పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమీకృత మార్కెట్ భవనం ప్రారంభించినా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అప్పగించలేదని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకురాగా, తాళాలు అప్పగించాలని, బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని అక్కడే ఉన్న కాంట్రాక్టర్‌కు మంత్రి తెలుపడంతో కాంట్రాక్టర్ వెంటనే కలెక్టర్ వల్లూరు క్రాంతికి తాళాలు అప్పగించారు.

రోగులకు కార్పొరేట్ వైద్యం అందించాలి

జహీరాబాద్ పట్టణంలో ఉన్న సర్కార్ దవాఖానలో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నదని, వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వైద్యం చేయాలన్నారు. డయాలసిస్ కేంద్రానికి వచ్చే రోగులకు మంచి వైద్యం చేయాలని, జహీరాబాద్‌లో ఉన్న కేంద్రానికి అదనపు పడకలు మంజూరు చేస్తామన్నారు. నిమ్జ్ ప్రాజెక్టు భూ సేకరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, జహీరాబాద్ ఆర్డీవో రాజు, మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

మెదక్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెల 29లోగా బియ్యం పట్టని మిల్లుల యజమానులపై ఆర్ఆర్ యాక్ట్ కింద స్థిర, చర ఆస్తులు జప్తు చేయడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మెదక్ కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. జిల్లాలో అధిక శాతం సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల యజమానులతో మిల్లుల వారీగా శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెలలు గడుస్తున్నా మిల్లర్లు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని, దీనిని తీవ్రంగా పరిగణమిస్తామన్నారు. సీఎంఆర్ కేటాయింపులపై కూలంకషంగా చర్చించారు. రైతుల నుంచి కొనుగోలు చేసి సేకరించిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ చేసి నెలాఖరులోగా నిర్దేశిత కోటాను భారత ఆహార సంస్థకు చేరవేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని తేల్చిచెప్పారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున, మిల్లర్ల అలసత్వాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్ణీత గడువులోగా లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు తేల్చి చెప్పారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని రైస్ మిల్లుల్లో పూర్తిస్థాయి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ రైస్ మిల్లింగ్ జరుపుతూ, ఈ నెలాఖరులోగా ఎఫ్‌సీఐకి నిల్వలు చేరవేయాలని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీసీఎస్‌వో బ్రహ్మారావు, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా



ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్యే జ్ఞాని లాస్య నందిత

రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

వెంటాడిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం

సదాశివపేట దర్గాలో గురువారం రాత్రి నందిత ప్రార్థనలు

ఇంటికి చేరుకుని తిరిగి అల్పాహారం కోసం వెళ్తుండగా ప్రమాదం

గాంధీ దవాఖానలో పోస్టుమార్టం

డ్రైవర్‌కు గాయాలు..

కుటుంబ సభ్యులను పరామర్శించిన హరీశ్‌రావు

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితను మృత్యువు వెంటాడిందనే చెప్పాలి. ఆమె ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మూడు సార్లు ప్రమాదానికి గురయ్యారు. మొదటిసారిగా లిఫ్ట్‌లో ఇరుక్కుపోగా, ఇటీవల నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మూడోసారి ఓఆర్ఆర్ పటాన్‌చెరు వద్ద జరిగిన ప్రమాదంలో మృత్యువు ఆమెను కబళించేసింది.

పటాన్‌చెరు, ఫిబ్రవరి 24 : శుక్రవారం తెల్లవారుజామున ఔటర్ రింగురోడ్డు రక్తసిక్తమైంది. సికింద్రాబాద్-కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జ్ఞాని లాస్య (37) రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. డ్రైవర్ ఆకాశ్ తీవ్రంగా గాయపడ్డారు. అడిషనల్ ఎస్పీ ఏ సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం సికింద్రాబాద్ - కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జ్ఞాని లాస్య నందిత (38) గురువారం రాత్రి 11గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులతో కలిసి రెండు కార్లలో సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలోని మిస్కిన్ షా బాబా దర్గాను దర్శించుకున్నారు. అక్కడ ప్రార్థనలు చేసి, రాత్రి ముంబయి హైవేపై సికింద్రాబాద్‌లోని ఇంటికి చేరుకున్నారు. అనంతరం లాస్య నందితకు ఆకలివేయడంతో అల్పాహారం తినేందుకు డ్రైవర్ ఆకాశ్‌తో కలిసి బయలు దేరారు. దర్గాకు వెళ్లే సమయంలో ముంబాయి హైవేపై అనేక హోటల్స్ చూడటంతో అక్కడే తినాలని అనుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున దాదాపు 4.45 ప్రాంతంలో శామీర్‌పేట్ ఓఆర్ఆర్ ఎక్కారు. సుల్తాన్‌పూర్ టోల్‌ప్లాజా దాటిన తరువాత 5.10 గంటల ప్రాంతంలో పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పటేల్‌గూడ సమీపంలోకి రాగానే డ్రైవర్ ఆకాశ్ నిద్రమత్తులో ముందున్న వాహనాన్ని ఢీ కొట్టబోయాడు. వెంటనే తేరుకుని ప్రమాదాన్ని తప్పించేందుకు ప్రయత్నించగా, వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ఎడమవైపు ఉన్న ఓఆర్ఆర్ మెటల్ బీమ్‌ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే జ్ఞాని లాస్య నందిత తీవ్రగాయాలకు గురై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. డ్రైవర్ ఆకాశ్‌కు గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్న పోలీసులు, ఎమ్మెల్యే ప్రాణాలతో ఉండొచ్చని భావించి అంబులెన్స్‌లో పటాన్‌చెరు పట్టణంలోని అమేధ దవాఖానకు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన డాక్టర్లు ఎమ్మెల్యే జ్ఞాని లాస్య నందిత అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. డ్రైవర్ ఆకాశ్‌కు మెరుగైన చికిత్స అందించేందుకు మదీనాగూడలోని శ్రీకర దవాఖానకు తరలించగా, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎంవీఐ పటాన్‌చెరు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పోలీసుశాఖ అధికారులు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. శ్రీకర దవాఖానలో చికిత్స పొందుతున్న డ్రైవర్ ఆకాశ్‌ను కలిసి ప్రమాద కారణాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రంతా సదాశివపేటకు వెళ్లి, తిరిగి ఇంటికి వచ్చిన క్రమంలో ఆకలి కావడంతోనే రింగ్‌రోడ్డుపై ప్రయాణించారని పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. ఎమ్మెల్యే పటాన్‌చెరు ప్రాంతంలోని హైవేపై ఉన్న హోటల్స్‌లో అల్పాహారం తినాలని అనుకుని రింగ్ రోడ్డుపై నుంచి వెళ్దామని డ్రైవర్‌కు చెప్పడంతో ఓఆర్ఆర్‌పైకి కారును తీసుకెళ్లాడు. పటేల్‌గూడ వద్ద కారు ప్రమాదానికి గురై విషాదం చోటుచేసుకుంది.

ఎమ్మెల్యే జ్ఞాని లాస్య నందిత మృతదేహాన్ని అంబులెన్స్‌లో గాంధీ దవాఖానకు పంపిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎమ్మెల్యే జ్ఞాని లాస్య నందిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్ రెడ్డి

హుటాహుటిన వచ్చిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించారనే సమాచారం తెలియడంతో దిగ్భ్రాంతి చెందిన సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు హుటాహుటిన పటాన్‌చెరులోని అమేధ దవాఖానకు చేరుకున్నారు. కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ మంచి యువ నాయకురాలిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నందిత మరణ వార్తతో బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో దవాఖానకు తరలివచ్చారు. పలువురు కార్పొరేటర్లు, నాయకులు లాస్య నందిత మృతదేహాన్ని చూసి విలపించారు. అక్కడి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అంబులెన్స్‌తోపాటు హరీశ్‌రావు గాంధీ దవాఖానకు వెళ్లారు.

లాస్యనందిత అంతిమయాత్రలో పాడె మోస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, మాణిక్‌రావు తదితరులు

అకాల మృతి బాధాకరం

ఎమ్మెల్యే లాస్యనందిత అంతిమయాత్రలో పాడెమోసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 23: ఎంతో రాజకీయ భవిష్యత్ ఉన్న కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం బాధాకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఉదయం మరణవార్త తెలుసుకున్న ఆయన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు దవాఖానకు చెరుకొని ఎమ్మెల్యే కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం కంటోన్మెంట్‌లో లాస్యనందిత నివాసానికి వెళ్లి ఆమె భౌతికాయాన్ని సందర్శించి పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. లాస్యనందిత ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మంత్రి దామోదర సంతాపం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. శుక్రవారం జహీరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన మంత్రి ఈ సందర్భంగా ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరాఉ. ఎంతో మంచి భవిష్యత్తు ఉన్న యువ ఎమ్మెల్యే ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు.

ఎమ్మెల్యే మృతికి మంత్రి పొన్నం సంతాపం

హుస్నాబాద్, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. ఇటీవల ఎమ్మెల్యేగా గెలిచి అకాల మృతి చెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. గత సంవత్సరం ఇదే నెలలో లాస్య తండ్రి సాయన్న మృతి నుంచి కోలుకోక ముందే ఆయన కూతురు లాస్య నందిత మృతి ఆకుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందన్నారు. లాస్య ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

లాస్య నందిత మృతి బాధాకరం

కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందనే వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రజామన్ననలతో చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్య నందిత అర్ధాంతరంగా దివంగతులు కావడం చాలా బాధాకరం. ఆమె తండ్రి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ సాయన్న ఎంతో ప్రజాభిమానం ఉన్న నాయకుడు. రాజకీయాల్లో తండ్రికి తగ్గ తనయురాలుగా కీర్తిప్రతిష్టలు సంపాదిస్తుందని అనుకున్నాం. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

– సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, నర్సాపూర్.

లాస్యనందిత మృతి కలిచివేసింది

– దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 23: యువ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మృతి కలిచివేసిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో ప్రజల మనిషి సాయన్న వారసురాలిగా ఎమ్మెల్యేగా అడుగుపెట్టిన ఆమె ఇలా రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. ఏడాది క్రితం సాయన్న మరణించడం, ఇప్పుడు ఆయన కుమార్తె మృతి చెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఇటీవల నల్లగొండ బీఆర్ఎస్ సభకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత గాయపడి కొలుకుని అసెంబ్లీకి వచ్చిందన్నారు. ఆమె మృతి తీరని లోటని, ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

యువనాయకురాలిని కోల్పోయాం

రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసింది. దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురుగా, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న లాస్య నందిత మరణం బీఆర్ఎస్‌కు తీరనినష్టం. కంటోన్మెంట్ ప్రజలు మంచి యువనాయకురాలిని కోల్పోయారు. నందిత కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుతున్నాను.

– గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే, పటాన్‌చెరు

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ఆరూర్‌లోని మిస్కిన్ బాబా దర్గా

సదాశివపేట, ఫిబ్రవరి 23 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఆరూర్ మిస్కిన్ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఆరూర్‌లో ఉన్న మిస్కిన్ బాబా దర్గాకు వచ్చినట్లు దర్గా నిర్వాహకురాలు జాహేదా బేగం తెలిపారు. ఆరోగ్యం బాగా లేకపోవడంతోఎమ్మెల్యే ఇక్కడికి వచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే సోదరి సైతం ఆరోగ్యం బాగాలేనప్పుడు ఇక్కడకు వచ్చేదని, ఆమెతో కలిసి ఎమ్మెల్యే లాస్య గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దర్గాకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసుకుని తిరిగి ఉదయం 3.30గంటలకు వెళ్లిపోయారని చెప్పారు.

దర్గా నిర్వాహకురాలు జాహేదబేగం

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్య

మనూరు మండలం డోవూరులో విషాదఛాయలు

శోకసంద్రంలో కుటుంబసభ్యులు



శిరీష (ఫైల్)

శిరీష మృతి చెందడంతో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మనూరు, ఫిబ్రవరి 23: బాసర ట్రిపుల్ ఐటీలో డోవూరుకు చెందిన విద్యార్థిని మృతిచెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మనూరు మండల పరిధిలోని డోవూర్ గ్రామానికి చెందిన తెనుగు నర్సింలు, రుక్మిణి దంపతుల కూతురు శిరీష (17) బాసర ట్రిపుల్ ఐటీ మొదటి సంవత్సరం చదువుతున్నది. అయితే, కొన్ని రోజులుగా సొంత గ్రామంలోనే ఉంటున్న శిరీషను గురువారం తండ్రి నర్సింలు బాసర కళాశాలలో దింపి వచ్చాడు. తిరిగి ఇంటికి చేరుకుని రాత్రి సమయంలో ఫోన్‌లో మాట్లాడినప్పుడు క్షేమంగానే ఉన్నట్లు చెప్పిందని కుటుంబీకులు తెలిపారు. కాగా, రాత్రి సుమారు 11గంటల సమయంలో శిరీష హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని బాసర కళాశాల నుంచి తమకు సమాచారం ఇచ్చారన్నారు. తల్లిదండ్రులకు క్షమాపణ చెబుతూ లెటర్ రాసి పెట్టి గదిలో ఉరి వేసుకున్నదని తెలిపారు. ఉన్నత చదువులు చదువుకుని తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తెస్తుందని అనుకుంటే.. తిరిగిరాని లోకాలకు చేరుకున్నదని బంధుమిత్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శిరీష మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

సంతాపం ప్రకటించిన ఎమ్మెల్సీ

మెదక్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో మంచి భవిష్యత్ ఉన్న యువ ఎమ్మెల్యే ఆకస్మిక మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి సాయన్న సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేశారని గుర్తుచేశారు. సాయన్న కుమార్తె ఎమ్మెల్యేగా ఎన్నికైన స్వల్ప కాలానికే మరణించడం దురదృష్టకరమన్నారు. కార్పొరేటర్‌గా ఎన్నికై క్షేత్రస్థాయిలో పనిచేయడం ద్వారా ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారని ఆమె సేవలను కొనియాడారు. లాస్యనందిత ఆత్మకు శాంతిచేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని కల్పించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

యువ ఎమ్మెల్యే మృతి బాధాకరం

– ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 23 : కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో అకాల మరణం బాధాకరమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ప్రమాద ఘటన వద్దకు వెళ్లి అక్కడి నుంచి దవాఖానకు వెళ్లారు. లాస్య నందిత మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయసులో ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్యనందిత నియోజకవర్గ ప్రజల అభిమానాలు చూరగొందన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.